సంపుటి : 9
సంచిక : 303
ఆదివారం
26 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.


E-PAPER

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999




**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వివాదం కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పుకు దారి తీసింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. అనంతరం, ఆయన స్థానంలో సీనియర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ మిగతా .. 2లో..

### ఆగస్టు నుంచి ఏపీలో

# సంజీవని ఆరోగ్య పథకం అమలు




- ఆగస్టు నుంచి 'సంజీవని'.. సద్వినియోగం చేసుకోండి: సీఎం చంద్రబాబు
- ప్రతి వ్యక్తికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- వేదవతి ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ
- గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదని సీఎం విమర్శ
- పరదాలు కట్టకుండా ప్రజల మధ్యకు వస్తున్నానన్న చంద్రబాబు

**ఆలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు.

**సంజీవని.. సమగ్ర ఆరోగ్య వ్యవస్థ**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మిగతా .. 2లో..

### ఖరీఫ్ సీజన్ పెండింగ్ బీమా బకాయిల విడుదలకు

## కేంద్రం గ్రీన్ సిగ్నల్




**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చలు ఫలించినట్లు ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా పెండింగ్ బకాయిల విడుదలకు మార్గం సుగమమైందన్నారు. గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న 2024-ఖరీఫ్ పంటల మిగతా .. 2లో..

### అమెరికా పౌరసత్వం వదులుకుంటున్నాను..

## త్వరలో భారత పౌరుడిగా మారబోతున్నా..

**యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** యువ కథానాయకుడు అఖిల్ అక్కినేని తన పౌరసత్వానికి సంబంధించి కీలక విషయాన్ని వెల్లడించారు. తాను ప్రస్తుతం అమెరికా పౌరుడినని, త్వరలోనే ఆ పౌరసత్వాన్ని వదులుకుని పూర్తిస్థాయి భారత పౌరుడిగా మారబోతున్నట్లు ప్రకటించారు. ఇటీవల తన చిత్రం 'లెనిన్' విజయవంతమైన నేపథ్యంలో, ఓ పాడ్ కాస్ట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నాకు అమెరికా మిగతా .. 2లో..

## ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తే ఉపేక్షించం

- ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరిక
- కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం
- స్మగ్లర్లకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్
- అధికారి పాత్రపై లోతైన విచారణకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం
- ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సూచన



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే వారు ఎవరైనా సరే, ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు 'ఆపరేషన్ అరణ్య'ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని ఆయన తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలో శనివారం రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఆయన అటవీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు వారికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను మిగతా .. 2లో..

### సినీ తారల క్రికెట్ పోటీలు

## ప్రారంభం



**విశాఖ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్-2 పోటీలు శనివారం విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వెండితెర నటులు శ్రీకాంత్, తరుణ్, సుధీర్‌బాబు, ఓంకార్‌లతో పాటు బుల్లి తెర నటులు, రాజకీయ నాయకులు, వైద్యులతో కూడిన ఆరు జట్లు మిగతా .. 2లో..

## ఇది విద్యార్థుల విజయం

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. మన దేశ విద్యా వ్యవస్థ ఎంతో గొప్పదని ప్రపంచమంతా పేరుందని.. కానీ, క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగం మిగతా .. 2లో..

### ఎల్-నినో కారణంగా

## తీవ్ర నీటి కొరత

**గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నత స్థాయి సమీక్ష**



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో ఈరోజు నిర్వహించిన ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్-నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను మిగతా .. 2లో..

### అలాంటి ప్రయత్నాలను

## వైకాపా నేతలు మానుకోవాలి

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేతలకు ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎద్దేవా చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై ఆ పార్టీ నేతలు చేసిన ఆరోపణలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. డీఎస్సీపై సవాల్ విసిరితే మాజీ సీఎం జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీపై ఎలాంటి అనుమానాలున్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైకాపా మిగతా .. 2లో..


### ఆగస్టు 17 నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టులో

## వాణిజ్య కార్యకలాపాలు

**తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి వాణిజ్య కార్యకలాపాలు ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే అవకాశముందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్‌పోర్టు ప్రారంభించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న రానున్నారని, ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికి, భారీ సభ మిగతా .. 2లో..




## చర్చలు సఫలం..

**ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటన**



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మిగతా .. 2లో..

### అరుణాచల మోక్ష మార్గంలో చిక్కుకుని


## ఆంధ్రా భక్తుడి మృతి



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గంలో ఉన్న ఇడుక్కి మిగతా .. 2లో..

## ఇరాన్ సీరియస్‌గా ఆలోచిస్తోంది

**పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ట్రంప్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో కొత్త ప్రకటన చేస్తున్నారు. చర్చల అంశాన్ని ఇరాన్ తీవ్రంగా పరిగణిస్తోందని తాజాగా పేర్కొన్నారు. అందుకే ఆ దేశంపై భీకర దాడులు చేయాలా.. వద్దా.. అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. భీకర దాడుల అంశంపై ఉన్నతస్థాయి అధికారులతో ట్రంప్ చర్చలు జరుపుతున్నారని వార్తలు వస్తోన్న నేపథ్యంలో ఈ స్పందన వచ్చింది. "ప్రస్తుతం మేం వారితో చర్చలు జరుపుతున్నాం. చర్చలను వారు సీరియస్‌గా తీసుకుంటున్నారు. అందుకు కారణం ఉండొచ్చు. వారు లొంగిపోవచ్చు.. లేదా ఏదైనా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా...

# కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి

తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. ప్రధానమంత్రి సలహా మేరకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(2) ప్రకారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి తక్షణమే ఆమోదించారు. నూతన విద్యాశాఖ మంత్రిగా నియమితులైన 64 ఏళ్ల ప్రహ్లాద్ జోషి, కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2004 నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా (2019–2024) సమర్థంగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఆహార (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన), పునరుత్పాదక ఇంధన (పీఎం సూర్య ఘర్ యోజన) శాఖల మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కర్ణాటకలో మధ్యాహ్న భోజన పథకాలతో ఆయనకు గతంలో అనుబంధం ఉంది. ఈ నియామక ప్రకటన వెలువడే సమయానికి ప్రహ్లాద్ జోషి తన నియోజకవర్గంలో పర్యటనలో ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని, హుబ్లీ నుంచి రాత్రి 7:30 గంటల విమానంలో ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలంలో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) అమలుతో పాటు అనేక సంస్కరణలు జరిగాయని ప్రశంసించారు.

# ఆగస్టు నుంచి ఏపీలో సంజీవని ఆరోగ్య పథకం అమలు

మాతా–శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ–ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలీమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు.. సాగునీటిపై హామీ**

గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ నేతలు ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తేలేదని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయని వారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేదవతి ప్రాజెక్టును రూ.1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు.

**ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్‌ను**

సభ అనంతరం అదే వేదికపై నుంచి ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాను గత పాలకుల్లా పరదాలు కట్టుకుని, చెట్లు నరికించి సభలు పెట్టడం లేదని, ప్రజల మధ్యకు నేరుగా వస్తున్నానని అన్నారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును సీఎం అందజేశారు.

# కేంద్రం గ్రీన్ సిగ్నల్

బీమా బకాయిలు విడుదల చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ వైఫల్యాలతో వ్యవసాయ శాఖలో పేరుకుపోయిన సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రైతుల పక్షాన స్పందించి బీమా బకాయిల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇది విద్యార్థుల విజయం

పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారన్నారు. విద్యా వ్యవస్థను మార్చాలని యువత కోరుకుంటున్నారన్నారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మన విద్యా వ్యవస్థను ఆరెస్సెస్ దొడ్డిదారిన చొరబడి నాశనం చేసిందని ఆరోపించారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై హింసకు, పెల్లెట్ గన్‌ల ప్రయోగం వంటి ఘటనలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యులని ఆరోపించారు. విద్యార్థులపై అణిచివేతను పార్లమెంటులో ప్రశ్నిస్తామని, అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని తెలిపారు.

**మోదీ సర్కార్‌కు ఇదో మేలుకొలుపు..**

భారతీయ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇకనైనా నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని రాహుల్ కోరారు. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో ఉందన్న రాహుల్.. దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న తీవ్ర సంక్షోభానికి నిదర్శనమన్నారు. మోదీ సర్కార్‌కు ఈ ఉద్యమం ఓ మేలుకొలుపు అన్నారు.

# త్వరలో భారత పౌరుడిగా మారబోతున్నా..

పౌరసత్వంతో పాటు ఆ దేశ పాస్‌పోర్ట్ ఉంది. అయితే, ప్రస్తుతం నేను దానిని వదులుకునే ప్రక్రియలో ఉన్నాను. మరికొన్ని నెలల్లో నేను అధికారికంగా భారత పౌరుడిని అవుతాను" అని అఖిల్ స్పష్టం చేశారు. 'లెనిన్' చిత్రం విజయోత్సవాల సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిల్ తన పౌరసత్వంపై మాట్లాడారు. అమెరికా పౌరసత్వాన్ని త్యజించే ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దేశం పట్ల ఆయనకున్న నిబద్ధతను చాటేలా ఉన్న ఈ నిర్ణయంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. అఖిల్ అక్కినేని అమెరికాలో జన్మించడంతో సహజంగానే ఆయనకు ఆ దేశ పౌరసత్వం లభించింది. అమెరికా పాస్‌పోర్ట్ కలిగి ఉన్నప్పటికీ, ఆయన తన జీవితంలో అత్యధిక భాగం భారతదేశంలోనే గడిపారు. ఇక్కడే పెరిగిన ఆయన, తన తండ్రి, అగ్ర నటుడు నాగార్జున అక్కినేని అడుగుజాడల్లో నడుస్తూ తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయకుడిగా అడుగుపెట్టారు. భారత రాజ్యాంగం ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతించదు. ఈ నేపథ్యంలో, భారతీయ పౌరసత్వ చట్టాలకు లోబడి ఆయన తన అమెరికా పౌరసత్వాన్ని వదులుకుంటున్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తే ఉపేక్షించం

అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. శనివారం తెల్లవారుజామున వరికుంట్ల గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారంతో వాహనాలను తనిఖీ చేశారు. ఇంటి సామాగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ ట్రక్కులో దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు ఈ ముఠాకు సహకరిస్తున్నట్లు తేలడంతో అతడిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా కేంద్రాలుగా పనిచేస్తున్న ప్రధాన సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సూచించారు.

# సినీ తారల క్రికెట్ పోటీలు ప్రారంభం

తలపడనున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో శ్రీఇన్ఫో మిసైల్స్ జట్టు 21 పరుగుల తేడాతో ఆంధ్రా గవర్నమెంట్ లయన్స్ జట్టుపై గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో బుల్లితెర రేంజర్స్ జట్టు 5 పరుగుల తేడాతో ఆయుష్మాన్ అవెంజర్స్ జట్టుపై విజయం సాధించింది. మూడో మ్యాచ్ టాలీవుడ్ థండర్స్, ఆంధ్రా పొలిటికల్ జట్ల మధ్య జరిగింది. మ్యాచ్‌లను తిలకించేందుకు అభిమానులు పెద్దఎత్తున స్టేడియానికి వచ్చారు. బౌండరీలు, సిక్సర్లు కొట్టినప్పుడు పెద్దఎత్తున కేరింతలతో హుషారెత్తించారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.

### ఎల్-నినో కారణంగా

# తీవ్ర నీటి కొరత

రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి తాగునీరు అందించాల్సి ఉందని... అందుకే ఈ నీటిని తాగునీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామని, మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూస్తూ, పోలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను తాగునీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా నేతలు మానుకోవాలి

మానుకోవాలని హితవు పలికారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైకాపా నేతలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని.. రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

# వాణిజ్య కార్యకలాపాలు

నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు.

**గిరి ప్రదక్షిణకు 6 లక్షల మంది భక్తులు..**

ఈ నెల 28, 29 తేదీల్లో విశాఖలో జరగనున్న గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై హోం మంత్రి వంగలపూడి అనిత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కలెక్టర్, సీపీలతో శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. గిరి ప్రదక్షిణకు 5 లక్షల నుంచి 6 లక్షల మంది వచ్చే అవకాశం ఉందని ఆమె మీడియాకు తెలిపారు.

# చర్చలు సఫలం..

మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. " నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించింది"అని తెలిపారు.

**కేసులు ఎత్తేస్తాం: జేపీ నడ్డా**

నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు. ఢిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. " విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం" అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు.

# ఆంధ్రా భక్తుడి మృతి

పిళ్లైయార్ గుహ (మోక్షమార్గం)లో చిక్కుకుని ఓ ఆంధ్రా భక్తుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... అరుణాచలేశ్వరాలయానికి శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన భక్తుడు మణికుమార్ (36) తన కుటుంబ సభ్యులతో వచ్చారు. స్వామివారి దర్శనం పూర్తయ్యాక గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. దారిలో ఇడుక్కి పిళ్లైయార్ ఆలయాన్ని సందర్శించే భక్తులు అక్కడున్న చిన్న గుహలో దూరి అటువైపునకు వస్తుంటారు. అలా వస్తే కుటుంబ కష్టాలు తీరుతాయని నమ్మకం. మణికుమార్ ఆ గుహలోకి ప్రవేశించి చిక్కుకున్నారు. ఊపిరాడక స్పృహ కోల్పోయారు. వెంటనే అక్కడున్నవారు అతికష్టం మీద బయటకు తీసి అంబులెన్స్ ద్వారా తిరువణ్ణామలై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారు. ఘటనపై తిరువణ్ణామలై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇరాన్ సీరియస్‌గా ఆలోచిస్తోంది

గుహలోకి వెళ్లి దాక్కోవచ్చు. మా వైపు నుంచి క్షిపణులు లోడ్ చేసే ఉన్నాయి. యుద్ధం ముగించడానికి రెండు అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు చేస్తోన్న దాడుల తీవ్రత పెంచి, వాళ్ల దగ్గర ఉన్నదంతా నాశనం చేయొచ్చు. లేకపోతే ఒప్పందం చేసుకోవచ్చు. డీల్ చేసుకోవడమనేది తెలివైన వ్యూహం. చర్చల విషయంలో వారు సీరియస్‌గా ఉన్నంతమాత్రాన ఒప్పందం కుదురుతుందని చెప్పలేం. చివరకు ఏం జరుగుతుందో వేచి చూడాలి" అని పేర్కొన్నారు. ఇరాన్‌పై భీకరదాడుల్ని పరిశీలిస్తున్నామని, దానిపై నిర్ణయం తీసుకుంటామని ముందు రోజు ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఇరాన్ నుంచి కౌంటర్ వచ్చింది. అమెరికా బెదిరింపులకు తలొగ్గబోమని.. బలప్రయోగం, ఒత్తిడికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరాన్‌కు ఆయుధాలు అమ్మవద్దని చైనా, రష్యాకు ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

---

### పూర్వ విద్యార్థుల ఔదార్యంతో

# రాయవరం హైస్కూల్‌కు కొత్త కళ

**రూ.6.40 లక్షల విరాళంతో అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే వేగుళ్ల చేతుల మీదుగా ప్రారంభం**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందించిన సహకారం మరోసారి ఆదర్శంగా నిలిచింది. మండల కేంద్రమైన రాయవరం లోని శ్రీ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల విరాళాలు, మండల పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. పాఠశాలలో విద్యను అభ్యసించిన 1975-80 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.6.40 లక్షలు విరాళంగా అందించగా, పనులు పూర్తి చేసేందుకు అదనంగా మండల పరిషత్ నిధుల నుంచి రూ.1.10 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో రెండు అసంపూర్తి తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు మొదటి అంతస్తు నుంచి రెండో అంతస్తుకు స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల ఆవరణలో 16 సీసీ కెమెరాలను కూడా అమర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ, తాము చదువుకున్న పాఠశాల కోసం పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది పూర్వ విద్యార్థులు తమ పాఠశాలల అభివృద్ధికి చేయూతనిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శాంతి సునీత, ఎంపీపీ నౌడు వెంకటరమణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని), రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై

# జగన్ స్పందన

**నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా చేశారని జగన్ వ్యాఖ్య**
**డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలని డిమాండ్**
**ఎన్డీఏ ప్రమాణాలను ఏపీలోనూ పాటించాలని సూచన**
**కొడుకును కాపాడుకుంటారా అంటూ సీఎంకు జగన్ ప్రశ్న**



**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

### చట్టసభలకు పోటీ చేసే

# వయసు 21 ఏళ్లకు తగ్గించాలి : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామన్నారు. నీట్ పశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని దేశాల్లో అమల్లో ఉన్న విధంగా భారత్‌లోనూ 21 ఏళ్లకే ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం రావాలన్నారు. రాహుల్ ప్రధాని అయితే.. చట్ట సభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందన్నారు. దేశంలో 30శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, జెన్ జీలు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యం : బండి సంజయ్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'పదవులు తాత్కాలికం, ప్రజల విశ్వాసమే అంతిమం' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు నడవడమే ప్రజాస్వామ్యమని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఆయన స్పందించారు. తమకు పార్టీ కంటే.. దేశమే ప్రధానమన్నారు. " ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే.. ప్రజల గొంతు వినడం, వారి మాటను గౌరవించడం, అవసరమైతే బాధ్యత తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. భాజపా దాన్నే పాటిస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పార్టీ విలువలను ప్రతిబింబిస్తుంది. ఇన్నేళ్లపాటు దేశసేవలో భాగమైనందుకు ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఎడిటర్ వాయిస్

## నాలుగు కోట్ల ఆంధ్రులు.. ఏపీలో కొత్త ఓట్ల లెక్క ఇదే..

ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ముగిసింది. ఈ సర్వేకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ కీలక వివరాలను అధికారికంగా వెల్లడించారు. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694 గా నమోదైందని సీఈఓ ప్రకటించారు. గత ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించిన అనంతరం తుది సంఖ్యను ఖరారు చేశారు. ప్రస్తుతం ఓట్లు తొలగించిన వారు, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు సరైన ఆధారాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సీఈవో సూచించారు.

ఇంటింటి పరిశీలనలో భాగంగా జాబితాలో అర్హత లేని, తప్పుగా నమోదైన వివిధ కేటగిరీల ఓట్లను అధికారులు గుర్తించి తొలగించారు. ఈ తొలగింపు ప్రక్రియలో అత్యధికంగా సరైన అడ్రస్ లేని ఓటర్లే పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తేలింది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 44,89,488 మంది ఓటర్లకు సంబంధించి సరైన చిరునామా లభించలేదని సీఈఓ తెలిపారు. ఇది కాకుండా మరణించిన ఓటర్ల సంఖ్య 15,22,174గా ఉండగా, మరో 14,43,886 మంది ఓటర్లు శాశ్వతంగా వలస వెళ్లినట్లు గుర్తించారు. అలాగే విచారణ సమయంలో ఎలాంటి ఆచూకీ దొరకని ఓటర్ల సంఖ్య 7,77,885గా తేలింది. ఇవి కాకుండా ఇతరత్రా కారణాల వల్ల మరో 8,327 మంది ఓట్లు తొలగింపునకు గురయ్యాయని వివరించారు. మరోవైపు ఈ సర్వే జరుగుతున్న కాలంలోనే వివిధ ప్రాంతాల నుంచి కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్ల సంఖ్య 7,37,216గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సర్ ప్రక్రియలో వివిధ కారణాల వల్ల ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగిపోయిన అర్హులైన నిజమైన ఓటర్లు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం భరోసా కల్పించింది. అర్హత ఉండి జాబితాలో పేరు గల్లంతైన వారు, సర్వే సమయంలో గైర్హాజరైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందని వివేక్ యాదవ్ ప్రకటించారు. అర్హత ఉన్న వారు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

సవతి కొడుకుతో అనైతిక బంధం..

## పెళ్లి చేసుకొని వెళ్లిపోతాననడంతో హత్య

### నిర్మల్ జిల్లాలో సవతి తల్లి ఘాతుకం



**నిర్మల్ పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** వావివరసలు మరిచి ఏర్పరచుకున్న అనైతిక బంధం చివరికి ఓ యువకుడి దారుణ హత్యకు దారితీసింది. వేరే పెళ్లి చేసుకుని వెళ్లిపోతాడనే కక్షతో సవతి తల్లే కుమారుడిని సుపారీ గ్యాంగ్‌తో దారుణంగా హత్య చేయించిన దిగ్భ్రాంతికర సంఘటన నిర్మల్ జిల్లాలో వెలుగుచూసింది. ఎస్పీ జానకి షర్మిల శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన ఆటో డ్రైవర్ అస్లాంఖాన్(28) తండ్రి 17 ఏళ్ల క్రితం అన్వరీబేగం(41)ను రెండో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉంది. కొంతకాలంగా అస్లాంఖాన్, అన్వరీబేగం ఎవరికీ తెలియకుండా చనువుగా మెలుగుతూ వస్తున్నారు. అయితే ఈ బంధానికి స్వస్తిపలికి వివాహం చేసుకుని కొత్త జీవితం ప్రారంభించాలని అస్లాంఖాన్ భావించాడు. పెళ్లి చేసుకోవద్దని, అవసరమైన ఆర్థికసాయం చేస్తుంటానని మభ్యపెట్టిన అన్వరీబేగం.. అతడు వినకపోవడంతో చంపేస్తానని బెదిరించింది. ప్రాణభయంతో అస్లాం తన బాబాయ్‌కి విషయం చెప్పాడు. అలా కుటుంబసభ్యులు, బంధువులకు తెలిసి వివాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో అస్లాంఖాన్ నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీలో బాబాయ్ ఇంటికి మకాం మార్చి తన ఆటో నడుపుకొంటూ జీవిస్తున్నాడు. తన బండారం బయటపడి పరువు పోయిందనే ఆగ్రహం, అస్లాంఖాన్ మరొకరిని పెళ్లి చేసుకొని వెళ్లిపోతాడన్న కక్షతో అన్వరీబేగం అతని హత్యకు స్కెచ్ వేసింది. ఈ పని కోసం మహారాష్ట్రకు చెందిన ముఖీద్‌తో రూ.6 లక్షలు సుపారీ మాట్లాడి, రూ.50 వేలు అడ్వాన్స్ ఇచ్చింది. తన సొంత తమ్ముడు షేక్ మహ్మద్‌కు కూడా డబ్బు ఆశచూపి ఈ కుట్రలో భాగస్వామిని చేసింది. అస్లాం ఫొటోలు, ఆటో నంబరు పంపడంతోపాటు నిరంతరం అతని కదలికలను సుపారీ గ్యాంగ్‌కు చేరవేసేది. జులై 15న ఉదయం వైఎస్సార్ కాలనీ వద్ద అస్లాం ఆటోలో ప్రయాణికులతో వస్తుండగా.. ముఖీద్‌తోపాటు అఫ్రోజ్, సాయినాథ్‌పవార్, షేక్ షాహిద్ ఎలియాస్ సల్మాన్‌లు కారులో వచ్చి అడ్డుకున్నారు. అస్లాంను బయటకు లాగి కత్తులతో విచక్షణారహితంగా పొడిచి పారిపోయారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అస్లాం అదేరోజు మృతిచెందాడు. ఈ దారుణ హత్యపై ఎస్పీ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ప్రధాన కుట్రదారు అన్వరీబేగంను 17న అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించింది. ఆమె తెలిపిన వివరాలతో ముఖీద్, అఫ్రోజ్, సాయినాథ్ పవార్, షేక్ షాహిద్, షేక్ మహ్మద్‌లను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

## ఐదో అంతస్తు నుంచి దూకి పీజీ వైద్యవిద్యార్థిని బలవన్మరణం



**కీసర, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారంలో విషాదం చోటు చేసుకుంది. పీజీ వైద్య విద్యార్థిని దీక్షిత (26) ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నాగారం వెస్ట్ గాంధీనగర్‌లో ఈ ఘటన జరిగింది. స్థానికులు వెంటనే ఆమెను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. దీక్షిత బెంగళూరులోని ఓ కళాశాలలో పీజీ ఆప్తమాలజీ మొదటి సంవత్సరం చదువుతోంది.

## కాలువలో స్నానానికి దిగి.. ముగ్గురి మృతి

### అందరూ అక్కాచెల్లెళ్ల పిల్లలే!



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** సరదాగా కాలువలోకి దిగిన అక్కాచెల్లెళ్ల పిల్లలు ముగ్గురు మృత్యువాత పడిన విషాదమిది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా రామచంద్రపురం మండలం లో ఈ ఘటన జరిగింది. బంధువుల కథనం ప్రకారం.. వెలంపాలేనికి చెందిన పోతుల మధు సాల్మాన్‌రాజుకు నలుగురు కుమార్తెలు. వీరందరికీ పెళ్లిళ్లయ్యాయి. తమ కుటుంబాలతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. సాల్మాన్‌రాజు గతేడాది మృతిచెందారు. గురువారం సంవత్సరీకం కాగా, ఇటీవల పిల్లలతో సహా కుమార్తెలందరూ తల్లి గారింటికి వచ్చారు. శుక్రవారం అక్కాచెల్లెళ్ల పిల్లలు ఎనిమిది మంది కలసి చంద్రబాబునగర్ సమీపంలోని కాలువ వద్దకు వెళ్లారు. వేమన హర్షిత పావని(14) తొలుత స్నానం చేస్తూ నీళ్లలో మునిగిపోయింది. ఆమెను రక్షించే క్రమంలో కనికెళ్ల రంజిత్(15) కాలువలోకి దిగి కొట్టుకుపోయాడు. తర్వాత బొక్కే వీరేంద్ర(19) దిగి గల్లంతయ్యాడు. మిగతా పిల్లలు ఇంటికొచ్చి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ద్రాక్షారామ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లను పిలిపించి గాలించగా మృతదేహాలు లభ్యమయ్యాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ మృతుల కుటుంబాలను ఓదార్చారు.

## ట్రైనీ ఐపీఎస్‌ల కేసు దర్యాప్తు వేగవంతం

### ఇప్పటికీ షాక్‌లోనే బాధితురాలు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ మహిళా భద్రతా విభాగం పోలీసులు.. ట్రైనీ ఐపీఎస్‌ల కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు సేకరించారు. తనపై ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కేసు దర్యాప్తు బాధ్యతను ఉన్నతాధికారులు మహిళా భద్రతా విభాగానికి అప్పగించారు. దీంతో మూడు రోజులుగా డీసీపీ లావణ్యనాయక్ జాదవ్ ఆధ్వర్యంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధితురాలు షాక్‌లోనే ఉన్నట్లు సమాచారం. ఆమె మానసిక ఒత్తిడి నుంచి బయటపడ్డాక పూర్తి వివరాలు రాబట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## తల్లికి వందనం డబ్బుల కోసం భార్య హత్య

**పెద్దతిప్పసముద్రం, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యానికి బానిసైన ఓ భర్త.. తల్లికి వందనం డబ్బుల కోసం భార్యను హత్యచేసిన ఘటన అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన రమాదేవి(27)కి బి.కొత్తకోట మండలం దయ్యాలవారిపల్లెకు చెందిన సురేశ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యాభర్తలిద్దరూ కూలీలే. మూడు నెలల క్రితం వారు గొడవ పడటంతో పిల్లలను రమాదేవి తన తల్లిదండ్రుల దగ్గర ఉంచింది. గురువారం సురేశ్ మద్యం తాగి ఇంటికొచ్చి.. ప్రభుత్వం అందించిన తల్లికి వందనం డబ్బులు ఇవ్వాలంటూ భార్యతో గొడవకు దిగాడు. ఆమె నిరాకరించడంతో రమాదేవిపై కత్తితో దాడి చేయడంతో ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. అనంతరం సురేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




ఆదివారం, 26 జూలై, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత — www.viswamvoice.com




# సింగంపల్లి ఆశ్రమ పాఠశాలలో నిర్వహణ లోపం

- చర్యలకు ఆదేశాలు జారీ చేసిన ఎస్టీ కమిషన్ చైర్మన్




**రాజవొమ్మంగి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం సింగంపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. సింగంపల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించిన చైర్మన్ పాఠశాల పరిశుభ్రత, తరగతి గదులు, బాత్ రూంలు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, వాటర్ ట్యాప్‌లు, విద్యుత్ బల్బులు, ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ పాడై ఉండడాన్ని గుర్తించి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్టోర్‌రూమ్‌ను పరిశీలించి బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, నూనెతో పాటు ఇతర ఆహార పదార్థాల నాణ్యత, గడువు తేదీలు, నిల్వ రికార్డులను తనిఖీ చేశారు. తదుపరి విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ఆట స్థలం లెవెలింగ్ చేయాలని, క్రీడా సామగ్రి అందించాలని, కోతుల సమస్య తీవ్రంగా ఉందని విద్యార్థులు చైర్మన్ కు వివరించారు. విద్య, వైద్యం, వసతి తదితర అంశాలపై కూడా విద్యార్థులతో చర్చించారు. పాఠశాల స్టూడెంట్ లీడర్లను ప్రత్యేకంగా పిలిపించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై వారి సమస్యలను విన్నారు. విద్యార్థులకు రాత్రి స్టడీ అవర్స్ నిర్వహించాల్సి వస్తున్నందున ఉపాధ్యాయులు పాఠశాల ప్రాంగణంలోనే ఉండేందుకు నివాస క్వార్టర్లు అవసరమని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత స్థాయి నైపుణ్య శిక్షణ అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేవని గిరిజన ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో వైద్య అధికారులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అభివృద్ధి చేసే అంశాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# అథ్లెట్ కుంజా రజితకు ముఖ్యమంత్రి భరోసా

ఆసియాన్ ఛాంపియన్షిప్ 400మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పథకం - 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా శిక్షణ పొందుతున్న రజిత
సొంత ఇంటి నిర్మాణం పాటు మూడు లక్షల ఆర్థిక సాయం - ప్రతీ నెల న్యూట్రిషన్, డైట్ ఖర్చులకు ప్రభుత్వం సాయం




**పోలవరం జిల్లా, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా, కూనవరం మండలానికి చెందిన కోయ గిరిజన యువ క్రీడాకారిణి కుంజా రజితను ముఖ్యమంత్రికి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి స్వయంగా పరిచయం చేశారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న రజితను ప్రత్యేకంగా తీసుకువచ్చి ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కల్పించారు. కుంజా రజిత జాతీయ స్థాయిలో అనేక బంగారు పతకాలు సాధించిన ప్రతిభావంతమైన స్ప్రింటర్. ఆసియన్ చాంపియన్‌షిప్‌లో 400 మీటర్ల రిలే విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి తీసుకువచ్చారు. ఆమె ప్రతిభను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, గవర్నర్ గతంలో తమ అధికారిక ట్విట్టర్ వేదికగా అభినందించారు. ప్రస్తుతం కుంజా రజిత 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా శిక్షణ పొందుతున్న నేపథ్యంలో ఆమెకు ఆర్థిక ప్రోత్సాహం, సొంత ఇంటి సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రజిత భవిష్యత్తులో దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వెంటనే జిల్లా కలెక్టర్‌కు 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే కుంజా రజితకు సొంత ఇంటి స్థలం కేటాయించి, హౌసింగ్ పథకం ద్వారా ఇంటిని మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, ఆమె శిక్షణకు అవసరమైన ప్రతి నెల న్యూట్రిషన్, డైట్ ఖర్చులను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ పరంగా అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, గిరిజన యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.



# రైతులు ఆరుతడి పంటలనే వేసుకోవాలి

పంటలకు బీమా తప్పనిసరి : తాసిల్దార్ సునీత



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో రైతులందరూ ఎల్నీనో దృష్ట్యా ఆరుతడి పంటలనే వేసుకోవాలని కోరుకొండ తాసిల్దార్ సునీత అన్నారు. శనివారం వ్యవసాయశాఖ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ వరకు మండలంలోని రైతులందరూ ఆరుతడి పంటలనే వేసుకోవాలని, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు సునీత తెలిపారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు మూడు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బూరుగుపూడి, బుచ్చెంపేట గ్రామాలలో ఆరుతడి పంటలు, అపరాలపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. అనంతరం వ్యవసాయశాఖ ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వాతావరణం పరిస్థితులు దృష్ట్యా తమ పంటలకు తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. యూరియా,డిఏపి వంటి ఎరువులను ప్రభుత్వం అందుబాటుతో తీసుకువచ్చిన యాప్ ద్వారానే తీసుకోవాలని, యాప్ పై రైతులకు అవగాహన ఏర్పరిచారు. ఈ కార్యక్రమంలో బూరుగుపూడి సొసైటీ అధ్యక్షులు కంటే నాగకేశవరావు, వ్యవసాయశాఖ సిబ్బంది, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఐఐఐటికి కాటవరం శ్రీ మహతి విద్యార్థి

# రామ్ చరణ్ ఎంపిక



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం గ్రామంలోని శ్రీ మహతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థి పి రామ్ చరణ్ ఐఐటీ కి ఎంపిక కావడం జరిగిందని ఈ సందర్భంగా రామ్ చరణ్ ను పాఠశాల కరస్పాండెంట్ ఏ.శ్రీనివాస్ ఐఐటి అకాడమిక్ డైరెక్టర్ రాంప్రసాద్ మరియు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సీతానగరం ఎరుకల సంఘం ఆధ్వర్యంలో

# ఘనంగా ఏకలవ్యుని జయంతి వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం నాలుగు బొమ్మల సెంటర్లో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మరియు గండిపోసమ్మ తల్లి ఎరుకల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మానుపాటి అంజిబాబు అధ్యక్షతన తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని ఏకలవ్యుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానుపాటి అంజిబాబు మాట్లాడుతూ శనివారం ఏకలవ్యుణి జయంతి సందర్భంగా భారీ కేకును కట్ చేసి పలువురుకు స్వీట్స్ పంచడం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎరుకుల సామాజిక పెద్దలను పూలమాలలతోనూ, సాలువాలతోనూ ఘనంగా సన్మానించామని అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించామన్నారు. ఎరుకుల కులస్థులు అనాదిగా నిరాదరణకు గురవుతున్నారని ప్రభుత్వాలన్ని వారికి ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ఎరుకుల అభివృద్ధికి భాద్యతాయుతంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య జయంతిని మహాభారత కాలపు గొప్ప విలుకాడు,గురుభక్తికి ప్రతిరూపమైన ఏకలవ్యుని స్మరించుకుంటూ ప్రతి ఏటా ఆషాఢ మాసంలో తొలి ఏకాదశి రోజున జరుపుకుంటారని ముఖ్యంగా ఎరుకుల కులస్థులు,గిరిజనులు మరియు ఆదివాసీ సంఘాల వారు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. మండల కేంద్రం నందు ఏకలవ్యుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ను కోరడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతానగరం గ్రామ మాజీ సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, కాతా సత్యనారాయణ, మట్ట కాపు, జిల్లా సెక్రెటరీ మానుపాటి సూర్యనారాయణ, కూతాడి శ్రీను, పీరుగాని పోసియ్య, పీరుగాని యేసు, తదిరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కళాకారుడికి రూ.5 వేల సాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కళాకారుడికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. విజయవాడకు చెందిన మిమిక్రీ కళాకారుడు అచ్చి నాగరాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కంబాల శ్రీనివాసరావు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకున్న నాగరాజు ఆయనను కలిసి తన పరిస్థితిని వివరించి సహాయం చేయాలని కోరాడు. స్పందించిన కంబాల శ్రీనివాసరావు వెంటనే రామసేన సభ్యులు, సిబ్బందికి ఆర్థిక సాయం అందించాలని సూచించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద రామసేన సిబ్బంది నాగరాజుకు రూ.5 వేల నగదును అందజేశారు. కష్టకాలంలో అండగా నిలిచి ఆర్థిక సాయం చేసిన కంబాల శ్రీనివాసరావుకు కళాకారుడు అచ్చి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగు పంటల భీమాపై రైతులు దృష్టి సారించాలి




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా నీటి లభ్యతను బట్టి నీటి వినియోగం తక్కువగా ఉండే జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని సీతానగరం తహసిల్దార్ ఏ శ్రీనివాస్ మరియు మండల వ్యవసాయాధికారి ఏ గౌరీ దేవి సూచించారు.రైతులు తమ పొలాల పరిస్థితులు, నీటి వనరుల లభ్యత, నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె) లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి తగిన పంటలను ఎంపిక చేసుకోవాలనిసూచించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వరి, మిను ముల పంటలకు ప్రధాన మంత్రి పంటల బీమా యో జన (పి ఎం ఎఫ్ బి వై), అరటి పంటకు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్ డబ్ల్యూ బి సి ఐ ఎస్) అమలులో ఉన్నా యని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకంలో అర్హులైన రైతులు గడువు లోపు నమోదు చేసుకోవా లని కోరారు.అరటి పంటకు జూలై 31, మినుముల పంటకు జూలై 31, వరి పంటకు ఆగస్టు 15 వరకు బీమా నమోదు అవకాశం ఉందని, గడువు తర్వాత దరఖాస్తులు స్వీకరించ బడ వని తెలిపారు.వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించడం, నీటి వన రులను పొదుపుగా విని యోగించడం, పంటలను బీమా పరిధిలోకి తీసుకు రావడం ద్వారా రైతులు నష్టాలను అధిగమించవ చ్చని తెలిపారు.మరిన్ని వివరాల కోసం సమీప రైతు సేవా కేంద్రం (ఆర్ ఎస్ కె) లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయా ధికారి శ్రీమతి ఏ. గౌరీదేవి సూచించారు.

# ఫొటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ తెలియజేయండి



ఎస్సై వెంకట రమేష్

**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** ఈ గుర్తు తెలియని వ్యక్తి శనివారం సాయంత్రం ఐదుగంటల ప్రాంతములో ఆకస్మాత్తుగా తనకు కలిగిన అనారోగ్యము వలన కోరుకొండలో రోడ్ ప్రక్కన మృతి చెందినట్లు కోరుకొండ ఎస్సై వెంకట రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరు వ్యక్తికి సుమారు 65సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించమన్నారు. సదరు వ్యక్తి యొక్క ఆచూకీ తెలిసిన వారు దిగువ పేర్కొన్న ఫోన్ నంబర్స్, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ 9440904831 సర్కిల్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ 9440904829 వారికి తెలియజేయవలసిందిగా తెలిపారు.





# రావులపాలెంలో ఘనంగా ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ

## ముద్రగడ సేవలను స్మరించుకున్న తోట త్రిమూర్తులు, జక్కంపూడి రాజా, గొల్లపల్లి సూర్యారావు, జక్కంపూడి విజయలక్ష్మి




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలోని సీఆర్సీ ప్రాంగణంలో కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి కీర్తిశేషులు ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, పీఏసీ సభ్యులు తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలు, సామాజిక న్యాయం కోసం చూపిన అంకితభావం, విలువలతో కూడిన రాజకీయ జీవితం చిరస్మరణీయమని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన సేవలు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ముద్రగడ పద్మనాభం మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ సభలో పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సంస్మరణ సభకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కర్రి నాగిరెడ్డి, కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్, రాష్ట్ర కార్యదర్శి గొల్లపల్లి డేవిడ్ రాజ్, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముద్రగడ పద్మనాభం అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ముద్రగడ పద్మనాభం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# మంత్రి సుభాష్‌ను కలిసిన రామచంద్రపురం నూతన డీఎస్పీ శేషు

## ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం - అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా (డీఎస్పీ) బాధ్యతలు స్వీకరించిన మల్లా శేషు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖపట్నంలో సీఐడీ విభాగంలో విధులు నిర్వహించిన మల్లా శేషు సాధారణ బదిలీలలో భాగంగా రామచంద్రపురం సబ్ డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. గతంలో పలు కీలక విభాగాల్లో సేవలందించి పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన ఆయన, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో స్పెషల్ ఆఫీసర్‌గా కూడా పనిచేసి మంచి గుర్తింపు సాధించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పోలీసు శాఖ కృషి చేయాలని, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేసి సబ్ డివిజన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. డీఎస్పీ మల్లా శేషు మాట్లాడుతూ గంజాయి, జూదం, పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. తన పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని, క్రైమ్ రేట్‌ను తగ్గించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, గంజాయి రవాణా మరియు విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా జూదం, పేకాట, కోడిపందాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే శక్తులను అణచివేస్తామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరరహిత, ప్రశాంత రామచంద్రపురం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు, పామర్రు ఎస్ఐ సోమేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురంలో నిరసన ర్యాలీ

# పోస్టర్‌ను విడుదల చేసిన పిల్లి సూర్యప్రకాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, యువత మరియు విద్యార్థుల సమస్యలపై కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 28వ తేదీ మంగళవారం అమలాపురంలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను నేడు రామచంద్రపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ జాతీయ వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్) ప్రశ్నాపత్రాల అక్రమ విడుదలతో పాటు యువత, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. యువత, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. అమలాపురంలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరవుతున్నారని వెల్లడించారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు, విద్యార్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిల్లి సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు.

### శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో

# మిషన్ హరితోదయ ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం బాయిస్ న్యూస్ :** స్థానిక రామచంద్రపురం శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో శనివారం మిషన్ హరితోదయ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, పరిశుభ్రత, పచ్చదనం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థులు నినాదాలతో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే ప్రకృతిపై ప్రేమ, మొక్కల సంరక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. రీజనల్ ఇన్‌చార్జి ఎం.వి.ఎల్. నరేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులని, మిషన్ హరితోదయ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

### క్వాయర్ రంగ పరిశ్రమలకు ఊతం..

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశాలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో క్వాయర్ (కొబ్బరి పీచు) పరిశ్రమలను మరింత ప్రోత్సహిస్తూ, పర్యావరణ హిత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచి ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యాన శాఖ, బ్యాంకర్లతో కలిసి క్వాయర్ పరిశ్రమల అభివృద్ధి, ప్రభుత్వ కొనుగోళ్లు, ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో క్వాయర్ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ శాఖల్లో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉత్పత్తులకు బదులుగా క్వాయర్ జియో-టెక్స్టైల్స్ వంటి పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లు, ఇరిగేషన్, ఇంజినీరింగ్ శాఖల్లో క్వాయర్ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనిపై ప్రతి నెల లేదా త్రైమాసికానికి ఒకసారి సమన్వయ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. క్వాయర్ రంగ సమగ్ర అభివృద్ధికి మార్కెటింగ్, టెక్నాలజీ, పాలసీ, మౌలిక సదుపాయాల అంశాలపై ప్రత్యేక నిపుణుల కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న సబ్సిడీ పథకాలను అర్హులైన పారిశ్రామికవేత్తలు, మహిళలకు చేరవేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించి బ్యాంకింగ్, జీఎస్టీఐ, మార్కెటింగ్ అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లలో క్వాయర్ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎగుమతులను ప్రోత్సహించేందుకు నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ యువతకు ఉపాధి కల్పనలో క్వాయర్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని, పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి, ఉద్యాన శాఖ అధికారి బి.వి.రమణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ కుమార్ వర్మ, సీడీబీ బ్యాంక్ పీఓ టి.ఎస్.రావు, నాబార్డ్ ఏజీఎం వై.ఎస్.నాయుడు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్.శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అమలాపురం వీఐపీ దర్శనాలపై నిలదీత

## భక్తుడిపై దాడి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో పాలకమండల సభ్యులు, అధికారులు తీరుపై ఒక భక్తుడు నిరసన తెలిపారు. వీఐపీ దర్శనాల పేరుతో తొలి ఏకాదశి సందర్భంగా కొంతమందిని అడ్డదారిలో పంపించడంపై భక్తుడు ఆలయ పాలకమండలి సభ్యుడని నిలదీశారు. దీంతో భక్తుడిపై పాలకమండల సభ్యుడు దౌర్జన్యం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలి అని భక్తులు తెలిపారు.

# రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యునిగా అరిగెల బలరామమూర్తి



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యునిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అరిగెల బలరామ మూర్తిని సన్మానించిన జి.అగ్రహారం సొసైటీ చైర్మన్ అల్లాడ రవి, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు అడపా బాబ్జి, ఉప సర్పంచ్ బంధన రాంబాబు, అరిగెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# బుర్రకథతో వావ్ అనిపించిన స్టూడెంట్స్



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం గోపవరం హైస్కూల్లో నిర్వహించిన మెగా పీటీఎం 4.0 కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ విశేషంగా ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా విధానం, విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ సామాజిక సందేశంతో సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. మెగా పీటీఎం వేదికగా సాగిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మహిపాల చెరువు సెంటర్లో పెరుగుతున్న ప్రమాదాలు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మహిపాల చెరువు సెంటర్ ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పల్లంకుర్రు, పోతుకూరు మార్గాల నుంచి వచ్చే వాహనాలు ఇక్కడ కలుస్తుంటాయి. హైవేపై వాహనాల అతివేగంతో ఇబ్బంది పడుతున్నట్లు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఈ సెంటర్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# వేనోళ్ల నీ కీర్తనం.. నీ దర్శనం మా భాగ్యం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలంలో తొలి ఏకాదశి సందర్భంగా శనివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కేశవ స్వామివారి దేవాలయంలో అర్చకులు దుర్గాప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో తులసిపూజ, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# ముమ్మిడివరంలో యూట్యూబర్ అరెస్ట్



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అనుమతులు లేకుండా మొక్కలు తొలగించి, ప్రశ్నించిన వారిని దుర్భాషలాడిన యూట్యూబ్ ఛానెల్ నిర్వాహకుడు చీకురుమెల్లి రవికుమార్ను పోలీసులు అరెస్ట్ చేశారు. కాట్రేనికోన మండలానికి చెందిన నిందితుడు పలువురిని తీవ్ర పదజాలంతో బెదిరిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ముమ్మిడివరం ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

# చినకొత్తలంక గ్రామ దేవతకు ఆషాడం సారె



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మ వారికి ఆషాఢ సారె మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు సంప్రదాయ దుస్తులు ధరించి సారెతో కలిసి గ్రామ పురవీధులలో భక్తి ఉత్సవాలతో అమ్మవారికి సమర్పించారు. వివిధ రకాల పండ్లు, పూలు, స్వీట్లు తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. గ్రామ ప్రజలు, గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమలాపురంలో ఘనంగా ఏకలవ్య మహారాజు జయంతి వేడుకలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టుదల, ఆత్మవిశ్వాసం, గురుభక్తికి ప్రతీకగా నిలిచిన మహావీరుడు ఏకలవ్యుడని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణంలోని ఎరుకల ఆత్మగౌరవ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఏకలవ్య మహారాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎరుకల ఆత్మగౌరవ సేవా సంఘం నాయకుడు మద్దెల రామకృష్ణ పిలుపుమేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ స్వగృహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నల్లా పవన్ కుమార్ కేక్ కట్ చేసి ఎరుకల సామాజిక వర్గ ప్రజలకు, అందరికీ ఏకలవ్య జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచాడన్నారు. ద్రోణాచార్యుడి వద్ద విలువిద్య నేర్చుకోవాలని కోరుకున్నప్పటికీ పరిస్థితుల కారణంగా శిష్యరికం లభించలేదని, అయినప్పటికీ నిరాశ చెందకుండా ద్రోణాచార్యుడి మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించి దానినే గురువుగా భావిస్తూ అడవిలో నిరంతరం కఠోర సాధన చేశాడని తెలిపారు. అపారమైన కృషి, అంకితభావంతో అత్యుత్తమ విలుకాడిగా ఎదిగిన ఏకలవ్యుడు గురుభక్తికి నిదర్శనంగా ద్రోణాచార్యుడు కోరిన గురుదక్షిణగా తన కుడి చేతి బొటనవేలిని కూడా ఎలాంటి సంకోచం లేకుండా సమర్పించాడని పేర్కొన్నారు. తన ప్రతిభ కంటే గురువుకు ఇచ్చిన గౌరవాన్నే గొప్పదిగా భావించిన మహనీయుడిగా ఏకలవ్యుడు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. నేటి యువత ఏకలవ్యుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఎన్ని అవరోధాలు ఎదురైనా లక్ష్యసాధన కోసం పట్టుదలతో శ్రమించాలని, విద్య, క్రమశిక్షణ, గురువుల పట్ల గౌరవంతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నల్లా పవన్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల ఆత్మగౌరవ సేవా సంఘం నాయకులు మన్నే రామదాసు, శీలం ఆంజనేయులు, బండి సత్తిబాబు, సజ్జ ప్రసాద్, మాణిక్యం సోమయ్య, శీలం వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


### విద్యార్థి-యువజన సంఘాల పోరాట ఫలితంగా

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా

## ప్రజాస్వామ్య ఉద్యమ విజయానికి నిదర్శనం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి,యువజన సంఘాల ఐక్య పోరాటానికి లభించిన విజయంగా పీడీఎస్‌యూ (పీ.డీ. ఎస్.యు ), పీవైఎల్ పి.వై.ఎల్ పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పీ.డీ. ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీ.వై.ఎల్ వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు చేపట్టిన ఆందోళనలు, నిరసనలు, విద్యాసంస్థల బంద్‌లు, జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఉద్యమాలు ప్రజాభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశాయని తెలిపారు. ఆ పోరాటాల ఒత్తిడి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే, మంత్రి రాజీనామాతో మాత్రమే సమస్య ముగిసిపోదని వారు స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఏ) పనితీరుపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని, నీట్ పరీక్షా విధానంపై విస్తృత చర్చ నిర్వహించాలని కోరారు. అలాగే పేపర్ లీకేజీ ఘటనల వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విజయానికి దేశవ్యాప్తంగా పోరాడిన విద్యార్థులు, యువజన సంఘాలు,ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజలు, అలాగే బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, ఐక్యంగా, నిరంతరంగా పోరాడితే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని ఈ పరిణామం మరోసారి రుజువు చేసిందని వారు పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం తమ ఉద్యమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ నాయకులు చింతా రాజారెడ్డి, వానపల్లి నాగరాజు, అంబటి కృష్ణ, బీఎస్పీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఆలీ, మాజీ పీ.డీ.ఎస్.యు నాయకులు చింతపల్లి సుధాకర్ ఐఎఫ్టియు నాయకులు ఎస్.కె కమల భాషా , హరి తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలు అభివృద్ధి మా ధ్యేయం : పిల్లి దంపతులు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం ఇంద్రపాలెంలోని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీకి కార్యకర్తలే నిజమైన ఊపిరి అని, నాయకులు పార్టీలు మారినా తెలుగుదేశం పార్టీ జెండాను నమ్ముకుని నిలబడేది కార్యకర్తలేనని జ్యోతుల నవీన్ కొనియాడారు. జగ్గంపేట తర్వాత కాకినాడ రూరల్ నియోజకవర్గంలోనే తనకు అత్యంత ఆదరణ లభించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "తల్లికి వందనం", ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.4 వేల సామాజిక పింఛన్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 27 నుంచి ప్రారంభమయ్యే "కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన – డోర్ టు డోర్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజల సందేహాలకు ధైర్యంగా సమాధానాలు చెబుతూ ప్రభుత్వ పనితీరును వివరించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని కూటమి జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని అన్నారు. కార్యకర్తల సంక్షేమం, రాజకీయ ఎదుగుదలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ నెల 27 నుంచి చేపట్టనున్న ప్రచార కార్యక్రమంతో పాటు రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.కార్యకర్తల కృషి వల్లే పార్టీ బలోపేతమై ఎన్నికల్లో విజయాలు సాధిస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితా సవరణలు, మై టీడీపీ పార్టీ యాప్‌లలో వివరాల నమోదు వంటి అంశాలపై బూత్ స్థాయి కన్వీనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు.దేవాలయ కమిటీలు, వివిధ నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సమావేశంలో పలువురు నాయకులు కోరారు. తమకు కుల, మత భేదాలు లేవని, పార్టీ కార్యకర్తలందరూ సమానమేనని పిల్లి దంపతులు స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, వారి వివరాలను పార్టీ అధిష్ఠానానికి తెలియజేసి నిబంధనల ప్రకారం పార్టీలో చేర్చుకుని సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. అనంతరం నియోజక వర్గంలోని గ్రామ కమిటీ అధ్యక్షులును ప్రకటించి సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, మేకా లక్ష్మణమూర్తి, కర్రి వెంకటరాజు, వివిధ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ లు,క్లస్టర్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు , టీడీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పాపారాయుడు జన్మదిన వేడుకలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రీ పాపారాయుడు జన్మదిన వేడుకలు కామత్ ఆర్కేడ్‌లో ఘనంగా జరిగింది. పాపారాయుడు కేక్ కట్ చేసి అభిమానులు నాయకులు మధ్య పుట్టినరోజు వేడుక నిర్వహించారు. ఆయనతో అభిమానులు నాయకులు నియోజవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేయించారు. అనంతరం పాపారాయుడు మాట్లాడుతూ శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తు రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని పేర్కొన్నారు. మండపేట నియోజవర్గంలో తోట త్రిమూర్తులు ను ఎమ్మెల్యే గా గెలిపించి జగన్మోహన్ రెడ్డిను సీఎం చేసే వరకు ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆయన నాయకులకు కార్యకర్తలను ఉద్దేశించి పేర్కొన్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థలో వృద్ధులకు అన్నదానం చేశారు,వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పాపారాయుడు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పాపారాయుడు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాయవరం ఎంపీపీ నౌడి వెంకటరమణ మాజీ సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు పలివెల సుధాకర్, వల్లూరీ రామకృష్ణ ,మాజీ కౌన్సిలర్ మండపల్లి రవికుమార్, ఎర్రగుంట సౌజన్య అయ్యప్ప,టౌన్ బూత్ కన్వీనర్ సూరంపూడి సత్యప్రసాద్, అధికారి శ్రీనివాస్, సాధనల శివ భగవాన్, జిల్లా ఎస్సీ సెల సెక్రెటరీ పో లమల సత్తిబాబు,శెట్టి ఆనంద్, ఒంటెద్దు శ్రీనివాస్, ఒంటెద్దు సాయికుమార్,బిలకుర్తి అంజి బాబు , షేక్ రోహిత్,కోనల సుభాష్ చంద్రబోస్, పైడిమల్ల రాజు,మండపల్లి రవీంద్ర,వి సత్తిబాబు, కోప్పిరెడ్డి సాయి, ఉండ్రా సి రమేష్, తమలపూడి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం నిధులు అందించడంలో

# కీలకంగా మారిన తపాలా కార్యాలయం

### లబ్ధిదారులు సౌకర్యార్థం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం నిధులను లబ్ధిదారులకు అందించడంలో మండపేట తపాలా కార్యాలయం పట్టణంలో ప్రథమ స్థానంలో ఉంది. దాదాపు 300 మంది లబ్ధిదారులకు 55 లక్షల రూపాయలను గత రెండు రోజులుగా అందించి ప్రజల మన్ననలను పొందింది. గతంలో పట్టణంలో 7921లబ్ధిదారులఖాతాలను ఓపెన్ చేసి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. ఐదు ప్రత్యేకమైన కౌంటర్ ఓపెన్ చేసి ఖాతాదారులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా వారికి నగదును అందజేశారు. వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలను కలుగజేశారు. పోస్ట్మాస్టర్ బి.సీతామహాలక్ష్మి, కెవి నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ, ప్రవీణ్ యాదవ్, ఎం.మధు, ఎండిఎం షరీఫ్, జి.వెంకట్రావు, సిహెచ్ శ్రీనివాస్, ఎస్.దుర్గాదేవి, కే.అనూష, పి.ప్రసాద్ తదితరులు ఖాతాదారులకు విశేషమైన సేవలందించారు. తపాలా ఉద్యోగుల సేవల పట్ల ప్రజలు, ఖాతాదారులు లబ్ధిదారులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# విద్యార్థులకు యూనిఫాం అందజేసిన పూర్వ విద్యార్థి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం కరప గ్రామంలో నక్క సూర్య నారాయణ మూర్తి ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్లస్ టు విద్యార్థినిలకు యూనిఫార్మ్స్ అవసరమని కరప గ్రామ మాజీ ప్రెసిడెంట్ పోలిశెట్టి తాతీలు చెప్పగా వెంటనే స్పందించిన నక్క సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి పత్తి వెంకటేశ్వరరావు 30 వేల రూపాయల విలువ చేసే యూనిఫామ్ దుస్తులను జనసేన సీనియర్ నాయకులు డాక్టర్ బోండా సూర్యారావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కరప గ్రామ మాజీ ప్రెసిడెంట్ పోలిశెట్టి తాతీలు, కాకినాడ టీడీపీ పార్లమెంట్ అడ్వైజరీ కమిటీ మెంబర్ దేవు వెంకటేశ్వరరావు, జనసేన సీనియర్ నాయకులు దూడల నారాయుడు, పేకేటి దుర్గాప్రసాద్, ఆరుముల్లి దొరబాబు, బొండా గోవిందు, మద్దాల శివ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు నిరంతర తాగునీటి సరఫరా

# అందించడమే లక్ష్యం : కలెక్టర్



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గుడిమెళ్లంక సమగ్ర మంచినీటి సరఫరా (సీపీడబ్ల్యూఎస్) పథకం పనులను వేగవంతం చేసి, గ్రామాలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర తాగునీటి సరఫరా అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శనివారం మలికిపురం మండలం గుడిమెళ్లంకలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో కలిసి సీపీడబ్ల్యూఎస్ పథకం పనులను పరిశీలించిన కలెక్టర్, తాగునీటి సరఫరా వ్యవస్థ పనితీరును సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నాలుగు మండలాల్లోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 97 ఆవాసాలకు సుమారు 1,18,983 మంది ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఇంటేక్ వెల్ వద్ద ఏర్పాటు చేసిన 50 హెచ్‌పీ మోటార్లు సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ, 70 హెచ్‌పీ సామర్థ్యం గల రెండు మోటార్లు కాలిపోవడంతో ముడి నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు పంపించడంలో అంతరాయం ఏర్పడిందని అధికారులు వివరించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ జిల్లాలో ఎల్–నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదై భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాలకు తాగునీటి అంతరాయం లేకుండా సీపీడబ్ల్యూఎస్ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారి ఎ.వి.ఎస్. రాజన్‌తో పాటు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలు అన్ని రంగాల్లో

# అభివృద్ధి పథంలో ఉండాలి

### పన్ను వసూళ్లు, పారిశుధ్యం, అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు
### ఆరు మున్సిపాలిటీల పనితీరుపై స్పెషల్ ఆఫీసర్ సమీక్ష



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి, రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని రీజినల్ డైరెక్టర్ కమ్ అప్పిలేట్ కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్డీఎంఏ), మండపేట ప్రత్యేక అధికారి సీహెచ్ నాగ నరసింహారావు సూచించారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన ఆరు మున్సిపాలిటీల పనితీరుపై అధికారులతో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మండపేట, నిడదవోలు, కొవ్వూరు, అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురం మున్సిపాలిటీల కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ, పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, వార్డు సచివాలయాల పనితీరుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆస్తి పన్నుల డిమాండ్ నోటీసుల పంపిణీ పూర్తి చేసి, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పట్టణాల్లో డోర్ టు డోర్ చెత్త సేకరణ, డ్రైనేజీల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అనధికార నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు, అనుమతి లేని ఫ్లెక్సీలు, బ్యానర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రకటన పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. వార్డు సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ ఎఫ్ఆర్ఎస్‌లో విధిగా హాజరు నమోదు చేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను నిర్దేశిత గడువులో ప్రజలకు అందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, కొవ్వూరు కమిషనర్ జీ సందీప్, అమలాపురం కమిషనర్ వీ నిర్మల్ కుమార్, రామచంద్రాపురం కమిషనర్ కే వీ ఆర్ ఆర్ రాజు, ముమ్మిడివరం కమిషనర్ పీ రవివర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో

# ఫ్లెక్సీ రహిత కాకినాడ కార్యక్రమం




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్లెక్సీ రహిత కాకినాడ మన లక్ష్యం అనే నినాదంతో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ప్రజలకు ఫ్లెక్సీల వల్ల కలిగే నష్టాలను అవగాహన కల్పిస్తూ కాకినాడ సర్పవరం సెంటర్ నుండి కాకినాడ భానుగుడి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే వి వి సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారులు, సానిటరీ సూపర్వైజర్లు, సచివాలయ సిబ్బంది డ్వాక్రా మహిళలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామాపై

# పిడిఎస్‌యు హర్షం

- నీట్ పరీక్ష లీకేజ్ బాధిత విద్యార్థులకు నివాళి
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని వెంటనే రద్దు చేయాలి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయటం పట్ల ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక బివి రమణయ్య కాలనీ డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నీట్ పరీక్ష పేపర్ లీకేజీ లో మృతి చెందిన బాధిత విద్యార్థులకు క్యాండిల్ వెలిగించి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ నెల 15 రోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ సిజెపి పరీక్ష పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు యువకులతో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం చేయడం వలన ఈరోజు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని విద్యార్థి యువత శక్తి ముందు న్యాయం నిలబడిందని తెలిపారు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో ప్రైవేటు వ్యక్తులు రాజ్యమేలాటం వలన పేపర్ లీకేజీ సంఘటనలు తరచూ జరుగుతున్నాయని కావున నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టిఏను వెంటనే రద్దు చేయాలని మృతి చెందిన బాధిత విద్యార్థి కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఢిల్లీలో విద్యార్థులు యువకులపై విచక్షణారహితంగా లాఠీచార్జి చేసిన పోలీసులు ప్రైవేటు వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని విద్యా వ్యవస్థలోని వైఫల్యాలను వెంటనే పరిష్కరించాలని పేపర్ లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అప్పుడే మృతి చెందిన విద్యార్థులకు ఘన నివాళి అని తెలిపారు విద్యార్థులు యువకుల చైతన్యానికి ముందు నిలిచి అలుపెరగని పోరాటం నిర్వహించిన సోనం వాంక్చుక్ అభిజిత్ దీప్కేలకు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో మధుర రాజు ఏ నవీన్ ఈ రమేష్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

### విజ్ఞాన్ విద్యాసంస్థలలో ఉత్సాహంగా గ్రీన్ కలర్ డే వేడుకలు
### పర్యావరణ పరిరక్షణపై చిన్నారులకు అవగాహన



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** చిన్నారులలో ప్రకృతి పట్ల ప్రేమను, పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో మండల కేంద్రమైన రాయవరంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో శనివారం గ్రీన్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణ అంతా పచ్చదనంతో కళకళలాడగా, విద్యార్థులు ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు, ఆకులు, ప్రకృతి చిత్రాలతో తరగతి గదులను ఆకర్షణీయంగా అలంకరించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతిబింబించే పాటలు, పద్యాలు, ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతి విద్యార్థి ప్రకృతిని ప్రేమించి పచ్చదనాన్ని కాపాడాలని ఉపాధ్యాయులు వివరించారు. పరిశుభ్రతను పాటించడం, మొక్కలను పెంచడం, నీటిని ఆదా చేయడం వంటి అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ మల్లిడి శేషవేణి మాట్లాడుతూ, ప్రకృతిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందిస్తే వారు భావి భారతానికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా పచ్చని భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. విద్యతో పాటు విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించే కార్యక్రమాలను విజ్ఞాన్ విద్యాసంస్థలు నిరంతరం నిర్వహిస్తున్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థి కేబినెట్ ఎన్నికలు



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో ప్రతి సంవత్సరం నిర్వహించే సంప్రదాయంలో భాగంగా ఈ ఏడాది విద్యార్థి కేబినెట్ ఎన్నికలు ఘనంగా జరిగాయి. విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జి లక్ష్మీనారాయణ తెలిపారు. రాజకీయ పార్టీల భావన, పార్టీ గుర్తులు, నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, రహస్య ఓటింగ్ వంటి అన్ని అంశాలతో నిజమైన ఎన్నికల తరహాలో కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ ఎన్నికల్లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, సీసీఏ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ పదవులకు విద్యార్థులు పోటీపడ్డారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు వేసి తమ నాయకులను ఎన్నుకున్నారు.రిజిస్ట్రేషన్ ఇన్‌చార్జి ఎం.వి.ఎల్. నరేష్ మాట్లాడుతూ, చిన్న వయసు నుంచే ఓటు హక్కు ప్రాముఖ్యత, నాయకత్వ లక్షణాలు నేర్పేందుకే ఈ కార్యక్రమం అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని స్కూల్ యాజమాన్యం వెల్లడించింది.

# '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' ప్రచారానికి ముమ్మర ఏర్పాట్లు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, జూలై 27 నుంచి ప్రారంభం కానున్న "2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అమలాపురంలో విస్తృత సన్నాహక సమావేశం నిర్వహించారు.అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వ విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, పెచ్చెట్టి చంద్రమౌళి, అధికారి జయ వెంకటలక్ష్మి, కర్రి దత్తుడు, తిక్కిరెడ్డి నేతాజీ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, కో–క్లస్టర్, యూనిట్, బూత్ సి యు బి ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చినకొండేపూడి పాఠశాలలో క్రీడల అభివృద్ధి కోసం

# పలివెల పదివేల ఆర్థిక సహాయం అందజేత



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాసీతానగరం మండలం చినకొండేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పిటిఎం 4.0 కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో బాల్ బ్యాట్మెంటన్ క్రీడలో రాష్ట్రస్థాయిలోప్రతిభ చాటిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని, ప్రధానోపాధ్యాయులను సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఘనంగాసన్మానించారు.పాఠశాలలో క్రీడల అభివృద్ధి కోసం దాత పలివెల వీరబాబు 20వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ చిడిపి గోపి ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చిట్టి స్వామి టి సునీత ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



### అంతర్జాతీయ వేదికపై

# ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలిచిన ఫెర్టీ9

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ ఫెర్టిలిటీ కేర్ నెట్‌వర్క్‌గా పేరొందిన ఫెర్టీ9కు ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది. ఫెర్టీ9 క్లినికల్ బృందం ప్రపంచ ప్రఖ్యాత సదస్సుల్లో పరిశోధనా పత్రాలను సమర్పించి సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచింది. ఈ ఏడాది ఈఎస్‌హెచ్‌ఆర్‌ఈ 2026లో నాలుగు పరిశోధనా పత్రాలతో పాటు ఒక మౌఖిక ప్రజెంటేషన్‌ను ఫెర్టీ9 వైద్య నిపుణులు సమర్పించారు. జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మరో నాలుగు పరిశోధనా పత్రాలను, ఆస్పైర్ సదస్సులో 11 పరిశోధనా పత్రాలను సమర్పించారు. గత ఐదేళ్లుగా నిర్వహించిన గర్భధారణ సహాయక చికిత్సల ఫలితాలపై ఆధారపడి ఈ పరిశోధనలు చేపట్టారు. మహిళల్లో పెరుగుతున్న వివాహ వయస్సు, ఉద్యోగ జీవనశైలి, రాత్రి వేళల విధుల ప్రభావం, పురుషుల్లో వీర్య నాణ్యత తగ్గడం, జన్యు విభజన పెరగడం వంటి అంశాలు సంతానోత్పత్తిపై చూపుతున్న ప్రభావాన్ని పరిశోధనలో విశ్లేషించారు. భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో తెలంగాణలో ఈ రేటు 1.8కు, ఆంధ్రప్రదేశ్‌లో 1.7కు చేరిందని ఫెర్టీ9 పేర్కొంది. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న పని ఒత్తిడి, ఆలస్య వివాహాలు, మహిళలు, పురుషుల్లో తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలు సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని వైద్య నిపుణులు తెలిపారు. ఫెర్టీ9 రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఫెర్టిలిటీ సెంటర్



వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని పుయ్యూరి, డాక్టర్ సౌమ్య వరుదు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా సంతానోత్పత్తి సమస్యలు పెరుగుతున్నప్పటికీ సరైన సమయంలో వైద్య నిపుణులను సంప్రదించి అవసరమైన పరీక్షలు, ఆధునిక చికిత్సలు ప్రారంభిస్తే తల్లిదండ్రులయ్యే అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. రాజమహేంద్రవరం ఫెర్టీ9 కేంద్రంలో అత్యాధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాల వైద్య సేవలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ప్రతి దంపతుల వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఫెర్టిలిటీ చికిత్సలను అందిస్తున్నామని వారు తెలిపారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫెర్టీ9 తన 11 కేంద్రాల్లో సూది అవసరం లేని ఐవీఎఫ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రోజువారీ ఇంజెక్షన్ల కారణంగా కలిగే నొప్పి, ఆందోళనను తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. అదనంగా, కృత్రిమ మేధ ఆధారిత ప్రజనన ఆరోగ్య పరిశోధనలపైనా ఫెర్టీ9 దృష్టి సారించింది. కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి ఐవీఎఫ్ విజయశాతాన్ని పెంచడం, గర్భాశయంలో పిండం స్థిరపడకపోవడం వంటి సమస్యలను తగ్గించడం లక్ష్యంగా పరిశోధనలు కొనసాగుతున్నాయని సంస్థ తెలిపింది. భవిష్యత్తులో గర్భాశయంలో పిండం స్థిరపడకపోవడం, గర్భస్రావాల నివారణకు ప్రత్యేకంగా అత్యున్నత వైద్య పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఫెర్టీ9 లక్ష్యంగా పెట్టుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని దంపతులకు మరింత ఆధునిక ఫెర్టిలిటీ సేవలను అందించేందుకు సంస్థ కృషి చేయనుంది.

**ఫెర్టీ9 గురించి**

ఫెర్టీ9 తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 11 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోంది. రాజమహేంద్రవరం ఫెర్టిలిటీ సెంటర్ అత్యాధునిక వైద్య సాంకేతికత, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ప్రపంచ స్థాయి ఫెర్టిలిటీ చికిత్సలతో వేలాది మంది దంపతులకు తల్లిదండ్రులయ్యే అవకాశాన్ని కల్పిస్తోంది. పరిశోధన, నాణ్యమైన వైద్య సేవలు, రోగి కేంద్రిత సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఫెర్టిలిటీ రంగంలో విశ్వసనీయ సంస్థగా ఫెర్టీ9 కొనసాగుతోంది.

# కోరుకొండ స్వయంభు నరసన్నను దర్శించుకున్న నీరుకొండ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ బిజెపి సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలం లోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండి భక్తులు పలు దేవాలయానికి వెళ్లి, స్వామి వారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరన్న చౌదరి పలువురు బిజెపి నాయకులతో స్వామివారిని దర్శించుకుని, స్వామి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని నీరుకొండ అన్నారు. ఆలయ అర్చకులు నీరుకొండకు వేద ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు తగరంపూడి గణపతి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ తోట..



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ తోటను వేదపండితుల ఆశీర్వచనాలతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్య సాయిబాబా, పెమ్మిరెడ్డి మురళి, కుమార్, తోట బాబులు, తణుకు అశోక్ తదితరులు ఆయన కూడా వెళ్ళి స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

# ‘శుభంకి పాఠశాల’ ఆర్థిక అక్షరాస్యత శిబిరం

### మహిళల ఆర్థిక సాధికారతకు శుభం హౌసింగ్ ఫైనాన్స్ సామాజిక బాధ్యత కార్యక్రమం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ, సామాజిక, పరి పాలన సూత్రాలు, ఆర్థిక సమ్మిళితత పట్ల తన నిబద్ధతను చాటుతూ శుభం హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో ‘శుభం కి పాఠశాల’ కార్యక్రమం కింద శనివారం రాజమండ్రిలో ఆర్థిక అక్షరా స్యత శిబిరం నిర్వహించారు. మహిళలు, స్థానిక ప్రజలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించి, సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడం, భవిష్యత్తును ఆర్థికంగా భద్రంగా నిర్మించుకునేలా ప్రోత్సహించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గృహ బడ్జెట్ నిర్వహణ, బాధ్యతాయుతమైన రుణ వినియోగం, క్రమబద్ధమైన పొదుపు, డిజిటల్ బ్యాంకింగ్, రుణ చరిత్రపై అవగాహన, గృహ యాజమాన్య ప్రణాళిక వంటి వ్యక్తిగత ఆర్థిక అంశాలపై నిపుణులు సులభమైన భాషలో వివరించారు. సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తూ, ఆర్థిక స్పృహ కలిగిన సమాజాన్ని నిర్మించడం శుభం హౌసింగ్ ఫైనాన్స్ లక్ష్యమని తెలిపారు. పాల్గొన్న వారికి గృహ బడ్జెట్ రూపొందించడం, డబ్బును సమర్థవంతంగా నిర్వహించడం, లక్ష్య ఆధారిత పొదుపు, ఆర్థిక ప్రణాళిక, సురక్షిత డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ, రుణ క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా రుణాలు తీసుకోవడం, గృహ రుణాలపై అవగాహన, ఆర్థిక సంసిద్ధత వంటి అంశాలపై ఆచరణాత్మక సూచనలు అందించారు. చర్చలు, నిజ జీవిత ఉదాహరణలు, ప్రశ్నోత్తరాల ద్వారా శిబిరాన్ని నిర్వహించడంతో పాల్గొన్నవారు చురుకుగా స్పందించారు. క్లిష్టమైన ఆర్థిక అంశాలను సులభంగా అర్థం చేసుకునే అవకాశం కలిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శుభం హౌసింగ్ ఫైనాన్స్ ప్రతినిధి మాట్లాడుతూ, ఆర్థిక అక్షరాస్యతే ఆర్థిక సాధికారతకు పునాది అని అన్నారు. ‘శుభం కి పాఠశాల’ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అవగాహన పెంపొందించి, సమాచారంతో కూడిన ఆర్థిక నిర్ణయాలు తీసుకునేలా చేయడంతో పాటు, సొంత ఇంటి కలను సాకారం చేసుకునే దిశగా వారికి ఆత్మవిశ్వాసం కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ‘శుభంకి పాఠశాల’ కార్యక్రమం సంస్థ సామాజిక బాధ్యత, పర్యావరణ, సామాజిక, పరిపాలన వ్యవస్థలో కీలక భాగమని పేర్కొన్నారు. విద్య, అవగాహన, సమ్మిళిత ఆర్థిక సాధికారత ద్వారా దేశవ్యాప్తంగా ఆర్థికంగా బలోపేతమైన సమాజాల నిర్మాణానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. రాజమండ్రిలో నిర్వహించిన ఈ శిబిరం దేశవ్యాప్తంగా కార్యక్రమాన్ని మరింత విస్తరించే దిశగా మరో కీలక ముందడుగుగా నిలిచిందని తెలిపారు.

# ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు కంబాల భరోసా..!

### సభ్యుల భీమా కోసం రూ. 1.50 లక్షల ఆర్థిక సాయం - స్పాట్‌లోనే కార్యవర్గానికి చెక్ అందజేత





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సభ్యులైన జర్నలిస్టుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారి హెల్త్ ఇన్సూరెన్స్ నిమిత్తం రామసేన వ్యవస్థాపకులు, బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు రూ. 1,50,000 (లక్షా యాభై వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శనివారం ది రాజమండ్రి ప్రెస్ క్లబ్‌ను స్వయంగా సందర్శించిన ఆయన, ఈ ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కును ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత బాల విజయసారథి, జనరల్ సెక్రటరీ వేణుగోపాల స్వామి(గోపి) లకు అందజేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఆయన జర్నలిస్టులతో ముచ్చటించారు. సమాజంలో జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. రాత్రి పగలు కష్టపడి పనిచేసే విలేకరులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని, అందుకే వారి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం నిమిత్తం తన వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. అంతేకాకుండా, భవిష్యత్తులో కూడా రాజమండ్రి ప్రెస్ క్లబ్‌కు, విలేకరుల సంక్షేమానికి ఏ రకమైన సహాయ సహకారాలు కావలసినా అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా కంబాల హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ లో మరో అంతస్తు నిర్మాణం, జిమ్ ఏర్పాటు.. వంటి అంశాలు విషయంలో కూడా తన తోడ్పాటు ఉంటుందని కంబాల ఈ సందర్భంగా ప్రకటించారు. కార్పొరేట్ స్థాయిలో రాజమండ్రి ప్రెస్ క్లబ్ భవనం ఉండాలని, ఆ విధంగా రూపుదిద్దడానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సారథి, గోపి లు మాట్లాడుతూ.. పాత్రికేయుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. ప్రతి సభ్యునికి 15లక్షల బీమా వర్తించేలా.. రూ. 1.50 లక్షల మొత్తం వెంటనే జర్నలిస్టులు అందరి సమక్షంలో అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ.. ముందుకొచ్చిన వారి ఉదారత అభినందనీయమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం ముందుకొచ్చిన కంబాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్, ఉపాధ్యక్షులు గంగాధర్, సంయుక్త కార్యదర్శి కృపానందం, ప్రసాద్, సభ్యులు పాలపర్తి శ్రీనివాస్, ఈశ్వర్, కొట్టే మధు, సత్యనారాయణ, సీసీసీ గోపాలకృష్ణ, చంటి, సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### బంగారు నగలు తయారుచేసే

# క్యాషింగ్ మిషన్‌ను వేరే ప్రాంతానికి తరలించాలి

**బెంగాల్ స్వర్ణకారుల రాకతో ఉపాధి కోల్పోతున్న స్థానిక స్వర్ణకారులు**
**క్యాషింగ్ ఏర్పాటుతో రోడ్డున పడ్డ 300 స్థానిక స్వర్ణకారుల కుటుంబాలు**
**క్యాషింగ్ మిషన్ వేరే ప్రాంతానికి తరలించాలని స్వర్ణకారులు ఆందోళన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారు నగలు తయారుచేసే క్యాషింగ్ మిషన్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని రాజమండ్రి స్వర్ణకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రాజమండ్రి మెయిన్ రోడ్‌లోని సీతమ్మ సందులు నూతనంగా ఏర్పాటు చేస్తున్న బంగారు నగలు తయారు చేసే క్యాషింగ్ మిషన్ షాపు వద్ద స్థానిక స్వర్ణకారులు ఆందోళన నిర్వహించారు. క్యాషింగ్ మిషన్ ను వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. స్వర్ణకారులు సంఘాల నాయకులు వీర్నీ వీరభద్రరావు, బాలకృష్ణ, విశ్వనాథ ఆచార్యులు మాట్లాడుతూ నెల రోజుల క్రితం చందా సత్రం వీధి లో బెంగాల్ కు చెందిన స్వర్ణకారులు క్యాషింగ్ మిషన్ ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. స్థానిక స్వర్ణకారులు ఉన్న ప్రాంతాలలో క్యాషింగ్ మిషన్ ఏర్పాటు చేయకూడదని అనపర్తి రెడ్డిలకు స్థానిక స్వర్ణ కారులు నచ్చజెప్పడంతో క్యాషింగ్ మిషన్ ఏర్పాటు చేయడం విరమించుకున్నారని తెలిపారు. అయితే అదే మిషను రాజమండ్రి మెయిన్ రోడ్ లోని స్వర్ణకారులు ఎక్కువగా ఉండే ప్రాంతం సీతమ్మ సందులో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనివలన స్థానిక స్వర్ణకారులు 300 కుటుంబాలు పనులు లేక రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక స్వర్ణకార వర్తక సంఘ నాయకులు బెంగాల్ నుంచి వచ్చిన వారికి మద్దతుగా నిలిసి స్థానిక స్వర్ణకారులు పొట్ట కొట్టే విధంగా క్యాషింగ్ మిషన్ ఏర్పాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ స్వర్ణకారులు రాజమండ్రి వచ్చి పనులు చేయడం వలన స్థానిక స్వర్ణకారులకు ఉపాధి లేక దయానియా పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్వర్ణకారులు అధికంగా ఉండే సీతమ్మ సందులో క్యాషింగ్ మిషన్ ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతానికి తరలించి స్థానిక స్వర్ణకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘాలు నాయకులు బత్రా వెంకట్,ముక్కమల స్వామి, పాలుమూరి సతీష్ కుమార్, కడియం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలియ ఏకాదశి పూజలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం ప్రాంగణంలో ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు వాడపల్లి శ్రీనివాసాచార్యులు, వారి కుమారుడు గణపతాచార్యులు ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచామృత మండపారాధన, స్వామివారికి అభిషేకం, పచ్చ తోరణం.. నిత్య కళ్యాణం అన్నట్లుగా శ్రీవారికి శాంతి కర కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. మాజీ కార్పొరేటర్ ఏవి రమణ దంపతులు కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాష్ రావు, రౌతు వరుణ్, ఎపిఐఐసి మాజీ చైర్మన్ శ్రీఘాకొళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం,మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, ప్రసాదుల హరనాథ్, మానే దొరబాబు, నిమ్మలపూడి గోవింద్, నగర ప్రముఖులు కూర్మదాసు ప్రభాకర్ రావు, పొలసానపల్లి హనుమంతరావు, అల్లు బాబీ, కారుమూరి వీర్రాజు, కృష్ణకుమార్ అడబాల రామకృష్ణ, పెద్దిరెడ్ల శ్రీనివాస్, సోము సాయి, గరికిపాటి సూర్యనారాయణ, పిచ్చిక అప్పారావు, సబ్బిశెట్టి రాంబాబు, డాక్టర్ వివి కృష్ణారావు, నరసింహారావు, నరసింగరాజు, గాడి శంకర్, బిల్డర్ చిన్న, గాడాల శీను తదితరులు పాల్గొన్నారు.





# కారు కొనాలని కోరిక ఉండేది..


## అందుకే సినిమాల్లోకి వచ్చా.. టాలీవుడ్ హీరోయిన్..

కేవలం కారు కొనడానికే తాను సినిమాల్లోకి నటించడానికి వచ్చానని ఓ టాలీవుడ్ హీరోయిన్. ఇటీవల ఓ సమ్మిట్ లో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం, పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే తన సినిమాకు మొదట్లో రూ.5 లక్షల పారితోషికం ఇచ్చారని అన్నారు. కేవలం కారు కొనడానికే నేను నా మొదటి సినిమాలో నటించానని ఎంతో ఉత్సాహంగా అన్నారు హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్.. ఇటీవల ఓ మీడియా సమ్మిట్ లో పాల్గొన్న ఆమె తన సినీ కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. "పెళ్లి తర్వాత నా జీవితంలో పెద్దగా మార్పులేమీ రాలేదు. నా భర్త జాకీ భగ్నానీ, నేను చాలా సహజంగా మా కొత్త జీవితంలోకి అడుగుపెట్టాము. మేము ఒకరి వృత్తిపరమైన నిర్ణయాల్లో మరొకరం జోక్యం చేసుకోము." అని అన్నారు. నటిగా, వ్యాపారవేత్తగా తన ప్రయాణం చాలా సంవత్సరాల క్రితమే ప్రారంభమైందని ఆమె అన్నారు. 2015లో హైదరాబాద్‌లో ఫ్‌45 జిమ్‌తో తన మొదటి వ్యాపారాన్ని ప్రారంభించానని, ఆ తర్వాత వెల్‌బీయింగ్ న్యూట్రిషన్ వంటి కంపెనీలలో పెట్టుబడి పెట్టి, ఆరోగ్యకరమైన ధాన్యాలను అందించే రెస్టారెంట్‌ను కూడా ప్రారంభించానని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపారు. అలాగే తన డైట్, ఆరోగ్యం గురించి మాట్లాడుతూ.. "సరైన జీవనశైలిని పాటిస్తే చాలా ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు. నేటి ఒత్తిడి, జీవనశైలి మార్పుల కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తమ శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. సీడ్ డేస్ అని పిలిచే రోజుల్లో కూడా నేను ఎక్కువగా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తింటాను," అని రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. "నేను నా మొదటి సినిమాను కన్నడలో చేశాను. ఆ సమయంలో నేను కాలేజీలో చదువుకుంటున్నాను. మొదట్లో, కారు కొనాలనే ఉద్దేశంతో సినిమాల్లో నటించడానికి ఒప్పుకున్నాను." రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చారు. "ఆ సినిమా తర్వాత, నటనే నా జీవితం అని నేను నిర్ణయించుకున్నాను" అని అన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషలలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు.

సినీ వాయిస్ CINE VOICE

### నేషనల్ ఛాంపియన్‌షిప్?..

# వెయిట్ లిఫ్టింగ్ చేసిన నటి ప్రగతి..



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో సహాయ నటిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ప్రగతి. ఎంతో మంది స్టార్ హీరోల సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం అటు సినిమాలు చేస్తూనే ఇటు తన కలలను సాకారం చేసుకుంటుంది. తెలుగు చిత్రసీమలో తనదైన నటనతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ప్రగతి మహావడి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. తల్లిగా, అత్తగా, వదినగా ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో మెప్పించిన ఆమె గత కొంతకాలంగా వెండితెరకు కాస్త దూరంగా ఉంటూ తన దృష్టినంతా ఫిట్‌నెస్ , స్పోర్ట్స్ వైపు మళ్లించారు. ప్రస్తుతం ప్రగతి తన కలలను సాకారం చేసుకుంటున్నారు. సాధారణంగా సినీ రంగానికి చెందిన నటీనటులు జిమ్ ఫోటోలు, వర్కవుట్ వీడియోలు షేర్ చేయడం చూస్తుంటాం. కానీ ప్రగతి మాత్రం కేవలం ఫిట్‌నెస్ కోసమే కాకుండా, ప్రొఫెషనల్ వెయిట్ లిఫ్టింగ్ , పవర్ లిఫ్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, మరియు అంతర్జాతీయ స్థాయిలో జరిగిన పలు వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు, అవార్డులు సాధించి భారతీయ మహిళల సత్తాను చాటిన ప్రగతి, తాజాగా మరొక ప్రతిష్టాత్మక 'నేషనల్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో ఆమె అత్యంత ప్రతిభను కనబరుస్తూ భారీ బరువులను లిఫ్ట్ చేశారు. ఈ పోటీలకు సంబంధించిన ఫోటోలను ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతాల్లో అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫోటోలలో ప్రగతి ఎంతో ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో వెయిట్ లిఫ్టింగ్ చేస్తూ కనిపించారు. పోటీల వేదికపై ఆమె చూపించిన ఏకాగ్రత, పట్టుదల, శ్రమను చూసి అభిమానులతో పాటు సినీ ప్రముఖులు, నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రగతి షేర్ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సాధించాలనే తపన, క్రమశిక్షణ, నిరంతర శ్రమ ఉంటే ఏ వయసులోనైనా కొత్త లక్ష్యాలను చేరుకోవచ్చని ప్రగతి మరోసారి నిరూపించారు. వర్కవుట్ విషయంలో , స్పోర్ట్స్‌లో ఆమె చూపిస్తున్న ఈ నిబద్ధత ఎంతోమంది మహిళలకు, ముఖ్యంగా గృహిణులకు , ఫిట్‌నెస్ ప్రియులకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది. వెండితెరపై నటిగా అలరించిన ప్రగతి, ఇప్పుడు క్రీడా రంగంలో కూడా పతకాలు సాధిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆమెకు అభినందనలు తెలపడంతో పాటు "మీరు ఎంతోమందికి ఇన్స్పిరేషన్" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రగతి మరిన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మెరిసి మరిన్ని పతకాలు సాధించాలని ఆశిద్దాం.




### రెండో టీ20లోనూ

# టీమిండియాదే విక్టరీ.. సిరీస్ కైవసం..



జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే టీ20 సిరీస్‌ను భారత జట్టు దక్కించుకుంది. భారత్ అందించిన 220 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వే టీం కేవలం 17.5 ఓవర్లలో 129 పరుగులకే పరిమితమైంది. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే టీ20 సిరీస్‌ను భారత జట్టు దక్కించుకుంది. భారత్ అందించిన 220 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వే టీం కేవలం 17.5 ఓవర్లలో 129 పరుగులకే పరిమితమైంది. భారత్ తరఫున యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వికెట్లు తీశారు. బ్రియన్ బెన్నెట్ (32 పరుగులు)ను ఔట్ చేయడం ద్వారా యశ్ తన తొలి టీ20ఐ వికెట్‌ను సాధించాడు. ప్రిన్స్, బెన్ కర్రన్, సికందర్ రజాలను ఔట్ చేశాడు. తడివానషే మరుమణి, న్యూమాన్ న్యామ్హురి క్రీజులో ఉన్నారు. అంతకుముందు, హరారేలో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన భారత్, 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 44 బంతుల్లో 81 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తిలక్ వర్మ 29 బంతుల్లో 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ 9 బంతుల్లో 20 పరుగులు చేశాడు. ఇషాన్, శ్రేయస్ అయ్యర్ (25) మూడవ వికెట్‌కు 66 పరుగులు జోడించగా, ఇషాన్ , తిలక్ నాలుగవ వికెట్‌కు 94 పరుగులు జతచేశారు. జింబాబ్వే తరఫున, న్యూమాన్ న్యామ్హురి, రిచర్డ్ నగరవా, బ్రయాన్ బెన్నెట్, బ్లెస్సింగ్ ముజరబాని, సికందర్ రజా తలా ఒక వికెట్ తీసుకున్నారు.

**భారత్:** అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రింకూ సింగ్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, యశ్ ఠాకూర్.

**జింబాబ్వే:** బ్రియాన్ బెన్నెట్, బెన్ కర్రాన్, డియోన్ మైయర్స్, సికందర్ రజా (కెప్టెన్), ర్యాన్ బర్ల్, వెస్లీ మాధవెరె, తాడివానాషే మారుమణి, బ్రాడ్ ఎవాన్స్, న్యూమాన్ న్యామ్హురి, రిచర్డ్ న్గర్వా, బ్లెస్సింగ్ ముజారబానీ.

### రోహిత్, బాబర్‌ల చెత్త రికార్డును

# సమం చేసిన సికందర్ రజా.. అదేంటంటే?




వరుస పరాజయాలు, కెప్టెన్‌గా చెత్త రికార్డులు సికందర్ రజాపై ఒత్తిడిని తీవ్రం చేశాయి. సిరీస్ కోల్పోయినప్పటికీ, ఆఖరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవడానికి జింబాబ్వే తీవ్రంగా శ్రమించాల్సి ఉంది. ఇక ఆదివారం జరిగి మ్యాచ్‌లో ఏం జరుగుతుందో చూడాలి. భారత్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజాకు వరుస పరాభవాలు ఎదురవుతున్నాయి. రెండో టీ20లో ఐదు పైసల పరుగు కూడా చేయకుండా డకౌట్‌గా వెనుతిరిగిన రజా.. రోహిత్ శర్మ, బాబర్ అజామ్‌ల పేరిట ఉన్న ఒక అత్యంత నిరాశాజనకమైన ప్రపంచ రికార్డును సమం చేశాడు.

**కెప్టెన్‌గా ఆరో డక్: రోహిత్, బాబర్‌ల సరసన నిలిచిన రజా..**

జింబాబ్వే ఆల్ రౌండర్, కెప్టెన్ సికందర్ రజాకు అస్సలు కలిసిరావడం లేదు. హరారే వేదికగా శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లోనూ అతడు ఘోరంగా విఫలమయ్యాడు. ప్రిన్స్ యాదవ్ వేసిన పదునైన బౌన్సర్‌ను సరిగ్గా అంచనా వేయలేక డకౌట్‌గా పెవిలియన్ దారిపట్టాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒక జట్టు కెప్టెన్‌గా సికందర్ రజాకు ఇది 6వ డకౌట్ కావడం గమనార్హం. దీంతో పూర్తి స్థాయి గుర్తింపు ఉన్న ఐసీసీ సభ్య దేశాల కెప్టెన్లలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే అవుటైన అవాంఛనీయ రికార్డు జాబితాలో రజా చేరాడు. గతంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌లు కూడా నాయకులుగా చెరో 6 సార్లు డకౌట్ అయ్యారు. ప్రస్తుతం రజా వీరిద్దరి రికార్డును సమం చేయగా, ఈ జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ 8 డక్‌లతో మొదటి స్థానంలో ఉన్నాడు.

**జింబాబ్వే తరఫున అత్యధిక డక్‌ల రేసులో రజా..**

భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌట్ కావడం ద్వారా సికందర్ రజా తన అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో మొత్తం డక్‌ల సంఖ్యను 10కి పెంచుకున్నాడు. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే అవుటైన ఆటగాళ్ల జాబితాలో రజా ప్రస్తుతం రెండో స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనతో పాటు స్వదేశంలో ఆడుతున్న మ్యాచ్‌లలోనూ రజా బ్యాటింగ్ ఫామ్ ఆందోళనకరంగా మారింది. జింబాబ్వే తరఫున అత్యధికంగా 11 సార్లు డకౌట్ అయిన వికెట్ కీపర్ బ్యాటర్ రెగిస్ చకబ్వా అగ్రస్థానంలో ఉండగా, రజా అతని రికార్డుకు దగ్గరయ్యాడు. వీరి తర్వాత పేసర్లు బ్లెస్సింగ్ ముజారబానీ, రిచర్డ్ న్గారవాలు చెరో 9 డక్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**భారత్ చేతిలో ఘోర పరాజయం: వైట్‌వాష్ తప్పించుకోవడం సాధ్యమేనా?**

ఈ సిరీస్‌లో సికందర్ రజా ఆల్ రౌండ్ ప్రదర్శన దారుణంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 2 ఇన్నింగ్స్‌లలో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి, బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీసుకోలేకపోయాడు. మొదటి మ్యాచ్‌లో 7 వికెట్లతో ఓడిపోయిన జింబాబ్వే, రెండో మ్యాచ్‌లో ఏకంగా 90 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఇది టీ20ల్లో జింబాబ్వేపై భారత్‌కు లభించిన రెండో అతిపెద్ద విజయం. సొంతగడ్డపై సిరీస్ ఇప్పటికే 0-2తో భారత్ హస్తగతమైన నేపథ్యంలో, ఆదివారం జరగబోయే ఆఖరి టి20 మ్యాచ్‌లో జింబాబ్వే వైట్‌వాష్‌ను తప్పించుకోవాలంటే రజా ఫామ్‌లోకి రావడం అత్యంత కీలకం. కెప్టెన్‌గా, సీనియర్ ఆటగాడిగా జట్టును ముందుండి నడిపించడంలో విఫలమవుతున్న రజా, ఆఖరి మ్యాచ్‌లోనైనా పుంజుకుని అభిమానులకు ఉపశమనం కలిగిస్తాడో లేదో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com